క్లుప్తంగా

అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీడీఓ సమీక్ష

తిరుమలాయపాలెం: మండలంలోని వివిధ శాఖల ఆధ్వర్యాన చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సోమవారం ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారిగా అధికారులతో మాట్లాడి పనుల వివరాలను తెలుసుకున్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారుల అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సూర్యనారాయణ, మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు సూచించారు. మండలంలోని బైరవునిపల్లి గ్రామంలో గుండపనేని కృష్ణవేణి తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరగా.. వీరికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడాక కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు గోళ్ల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ మరికంటి ఉమారాణి, రమేష్, గంధు సైదులు, పాలంపల్లి వెంకటపిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వాలు

కామేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. సోమవారం మండలంలోని పింజరమడుగు గ్రామశాఖ మహాసభ కాటినేని కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ రాజకీయాలను భ్రష్టు పట్టిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామశాఖ కార్యదర్శిగా కిన్నెర రామచంద్రయ్య, సహాయ కార్యదర్శిగా డేగల రాంబాబుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దుగ్గి కృష్ణ, అంబటి శ్రీనివాసరెడ్డి, బాదావత్ శ్రీను, కొండల్ రమణ, శ్రీరాములు, రమణ తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన చింతపల్లి జయరాజు మరణానికి కారకులను విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర నాయకులు గుంతేటి వీరభద్రం, లింగాల రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి కనకరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలో వారు మాట్లాడుతూ.. కొణిజర్ల మండలం రామచంద్రాపురంకు చెందిన జయరాజు కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. గంగాధర్, భాస్కర్, వీరబాబు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సరిపోదా శనివారం
వినోద	ద గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం
సాయిరాం	100 క్రోర్స్, హైడ్ ఎన్ సీక్
ఆదిత్య	చిక్లెట్స్
శ్రీనివాస	మత్తు వదలరా 2

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	46	బచ్చలికూర	3
వంకాయ	30		20
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	24		20
కాకర	40	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	54	తోటకూర	3
దొండ	46		20
పొట్లకాయ	60	గోంగూర	5
చిక్కుడు	110		20
గోరుచిక్కుడు	40	మెంతికూర	2
క్యాబేజీ	26		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		50
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	54		25
క్యాప్సికం	70	-ఖమ్మం వ్యవసాయం	

విలీన గ్రామాల అభివృద్ధికి కృషి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మంఅర్బన్: అల్లీపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: నగరంలోని విలీన గ్రామాల అభివృద్ధికి పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ అల్లీపురంలో రూ.1.35 కోట్లతో వివిధ అభివృద్ధి, రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరం ప్రజలకు తాగునీటి సరఫరా, విద్య, వైద్య సౌకర్యాలు అందించడమే కాక ట్రాఫిక్‌కు అనుగుణంగా డబుల్, ఫోర్ లైన్ల రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటి సంవత్సరంలోనే రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ మాత్రమేనని అన్నారు. దెబ్బతిన్న పంటలకు మార్కెట్‌లో ధర లేని సమయాన వేల కోట్ల నష్టం వచ్చినప్పటికీ మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ రావూరి కరుణసైదబాబు, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఈఈలు రంజిత్, కృష్ణలాల్, సహాయక కమిషనర్ సంపత్, తహసీల్దార్ సీహెచ్.స్వామి, సైదబాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పేర్కొన్నారు. గ్రామంలో డొంకరోడ్లు అభివృద్ధికి రూ.68 లక్షలు, అంతర్గత రహదార్ల కోసం రూ.40 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన మాజీ ఎంపీపీ సంత్, బిచ్చు, రమేష్, అబ్జల్. నంద్యాలు మాజీ ఎంపీటీసీ తేజావత్ వెంకన్న, లలిత దంపతుల ఆధ్వర్యాన మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మలీదు జగన్, రఘునాథపాలెం సొసైటీ చైర్మన్ తాత రఘురాం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, గుత్తా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యలను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నీటి ఎద్దడి సమస్య పరిష్కారం, తదితర సమస్యలపై పలు సూచనలు చేశారు.

డంపింగ్ యార్డ్‌ను తరలించాలి



మాట్లాడుతున్న పోటు ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంమామిళ్లగూడెం: గత నాలుగు రోజులుగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని దానవాయిగూడెం డంపింగ్ యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న స్థానికులకు సోమవారం ధర్నా శిబిరం వద్ద సీపీఐతో పాటు ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక, వీరనారి మణుల ఆశయ సాధన సమితుల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రజలు రోగాల బారిన పడకుండా డంపింగ్ యార్డును వెంటనే ఎత్తివేయాలని, వేలాది మంది ప్రజలు శ్వాసకోశ వ్యాధులకు గురై ఇబ్బందులు పడుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని, స్పందించకపోతే సీపీఐ పక్షాన ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలు జరిగినప్పుడు అధికార యంత్రాంగం ముఖం చాటేయడం, ఆ తర్వాత షరామామూలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మద్దతు తెలిపిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోటు కళావతి, మేకల శ్రీనివాస్,ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుడు బానోత్ భద్రూనాయక్, వీరనారి మణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేందర్‌బాయి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ, ఉపాధ్యక్షురాలు త్రివేణి, పుల్లూరు నాగయ్య, భవాని, జ్యోతి తదితరులు తదితరులు ఉన్నారు. కాగా దీక్షల్లో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బోడా వీరన్న, వివిధ పార్టీల నాయకులు పగడాల నాగేశ్వరరావు, గాలి క్రాంతికుమార్, నాగాచారి, పాలడుగు నాగేశ్వరరావు, రాము, వెంకన్న, బానోత్ చందర్‌రావు, విజయ, సోమిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, నల్లమోతు కోటేశ్వరరావు, శెట్టి రవీందర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రుద్రాక్షల ప్రదర్శన



రుద్రాక్షలను ప్రదర్శించిన దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: నేపాల్ రుద్రాక్షల ప్రదర్శన ఖమ్మంలోని ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ఏకముఖి రుద్రాక్ష నుంచి 21 ముఖముల రుద్రాక్షల వరకు ఉన్నాయి. పుట్టిన తేదీని అనుసరించి జాతకాలను పరిశీలించి వారి సమస్యలు, గృహ, వాస్తు, ఆరోగ్య, వ్యాపార, అభివృద్ధి కోసం వీటిని అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలిపారు. జాతిరత్నాలు కూడా తమ వద్ద లభ్యమవుతాయని పేర్కొన్నారు.

వాకర్స్ పారడైజ్ సందర్శన..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మినీ లకారం ట్యాంక్‌బండ్‌పై గల వాకర్స్ పారడైజ్‌ను మేయర్ నీరజ సోమవారం సందర్శించి వాకింగ్‌ట్రాక్‌ను పరిశీలించారు. వాకర్స్‌తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లకారం చెరువు, మినీ లకారం చెరువు మధ్యలో ఉన్న కాల్వలను పరిశీలించి వాగు పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

ఖమ్మంఅర్బన్: టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత సీఎం ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యాన ఖమ్మం కాల్వొడ్డులోని ఆయన విగ్రహం వద్ద సోమవారం అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ క్యాంటీన్‌లో ప్రతీరోజు 150 నుంచి 200 మందికి భోజనం సమకూరుస్తామని నిర్వాహకుడు నల్లమల రంజిత్ తెలిపారు. స్థానికులు పెళ్లిరోజు, పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేయొచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి శ్రీనివాస్ చౌదరి, ఆంజనేయులు గౌడ్, కై లేశ్వరరావు, కిరణ్, బి.కనకయ్య, బెల్లంకొండ శీను, నీరజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా..

కామేపల్లి: ప్రమాదవశాత్తు కారు బోల్తా పడిన ఘటనలో భార్యభర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని టేకులపల్లి మండలానికి చెందిన వెంకటేశ్వర్లు, ఎస్తర్‌రాణి దంపతులు కారులో ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో మార్గమధ్యలోని తాళ్లగూడెం స్టేజీ సమీపాన ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి పల్టీకొట్టగా.. భార్యభర్తలకు గాయాలయ్యాయి.

కేన్సర్ నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళల్లో వచ్చే బ్రెస్ట్ కేన్సర్‌పై యువేకాన్ సంస్థ ఆధ్వర్యాన సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల మహిళా సిబ్బంది, విద్యార్థినులు, అంగన్‌వాడీ టీచర్లకు పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యువేకాన్ ప్రాంతీయ మేనేజర్ డాక్టర్ షహనాజ్‌ఖాను, విద్య, పావని, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడలు ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో ఖమ్మం సౌత్ మండలస్థాయి పాఠశాలల క్రీడా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, తదితర క్రీడలు నిర్వహించగా.. తొలి రోజు బాలికలకు అండర్-14, 17 విభాగాల్లో నగరానికి చెందిన హార్వెస్ట్, శ్రీచైతన్య, న్యూ ఇరా, ఎస్ఆర్ స్కూల్స్ విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, మంగళవారం బాలురకు పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం సౌత్ పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.లాలయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగరాజు, ఎం.సుధాకర్, పారిజాతం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

రఘునాథపాలెం: మండలంలోని రఘునాథపాలెం పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ నెల 21, 22 తేదీల్లో జరిగిన మండలస్థాయి క్రీడల పోటీల్లో ప్రతిభ చాటి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన వారిని సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లు అభినందించారు. జూనియర్ బాలికల కబడ్డీ జట్టుతో పాటు వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన బి.సాయిప్రియ, ఖలీల్‌పాషా, యగ్నేష్, సాయిప్రియ, అక్షయ, తనూష్యాలను అభినందించి జోనల్ స్థాయిలో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం మున్నేరు వరద బాధితులకు పెరిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన నిత్యావసరాలను ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు గజివెల్లి సత్యనారాయణ సమక్షంలో సోమవారం పంపిణీ చేశారు. ఖమ్మంలో నష్టపోయిన కుల బంధువులకు కుటుంబానికి రెండు చీరలు, మూడు జాకెట్ ముక్కలు, రెండు పాయింట్ క్లాత్‌లు, షర్ట్ క్లాత్‌లు, 25 కేజీల బియ్యం, మూడు కేజీల కందిపప్పు, కేజీ చింతపండు, ఆయిల్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వినయ్‌కుమార్, సత్యనారాయణ, లక్ష్మిశేఖర్, వీరభాస్కర్, విజయకుమార్, శ్రీనివాస్, శ్రీధర్‌బాబు, శంకర్, రఘురాం, జిల్లా నాయకులు నాగార్జున, వెంకన్న, వెంకటేశ్వరావు, బెడద సత్యనారాయణ, 28వ డివిజన్ కార్పొరేటర్ లక్ష్మివెంకన్న పాల్గొన్నారు.

రాజీవ్‌గృహకల్పలో వైద్యశిబిరం..

ఖమ్మంరూరల్: మండలంలోని రాజీవ్ గృహకల్పలో ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజును పురస్కరించుకుని సేవా పక్వాడ్‌లో భాగంగా బీజేపీ ఆధ్వర్యాన శ్రీరక్ష ఆస్పత్రి సహకారంతో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి పరీక్షలు చేసి రూ.5లక్షల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈవీ రమేష్, మంద సరస్వతి, కె.ఉపేందర్, ఎల్.సాగర్ పాపారావు, ఎస్.సాయిరాం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లుల కోసం కాంట్రాక్టర్ల పాట్లు

ఖమ్మంమయూరిసెంటర్: చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వడం లేదని, అడిగితే పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ కాంట్రాక్టర్లు ఎంబీలను పట్టుకొని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. నగరంలో తాను చేసిన ఐదు పనులకు సంబంధించిన బిల్లుల కోసం 6 నెలలుగా ఇంజనీరింగ్ అధికారులు తిప్పుతున్నారని సదరు కాంట్రాక్టర్ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ కేఎంసీ అధికారులకు ఫార్వర్డ్ చేయడంతో కాంట్రాక్టర్ అక్కడకు చేరుకుని బిల్లులపై ఉన్నతాధికారులతో సంతకాలు చేయించి చెల్లించాలని కోరారు. అయినా ఏఈ పట్టించుకోవడం లేదని కాంట్రాక్టర్ తన పనులకు సంబంధించిన ఎంబీ రికార్డులను పట్టుకొని కేఎంసీ కార్యాలయంలో అధికారుల చుట్టూ తిరిగారు. కాంట్రాక్టర్ చేతిలో ఎంబీలను చూసిన వారు, ఈఈ సైతం అధికారుల వద్ద ఉండాల్సినవి కాంట్రాక్టర్ చేతికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీంతో తాను చేసిన పనులకు సంబంధించి బిల్లులు చేయకుండా ఏఈ తిప్పుతున్నాడని, చేసేదేమి లేక తానే వాటిని తీసుకొచ్చినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. కేఎంసీలో ఇంజనీరింగ్ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వినతుల వెల్లువ

ధంసలాపురంపెద్ద చెరువు ఆక్రమణలు అరికట్టాలి..



రైల్వే అధికారులకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ, 15వ, 16వ డివిజన్ల పరిధిలో ఉన్న ధంసలాపురం పెద్ద చెరువు ఆక్రమణకు గురైందని, సర్వే చేసి చెరువు ముప్పు నుంచి కాపాడాలని చెరువు ఆయకట్టు రైతులు, కొత్తగూడెం వాసులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల వచ్చిన భారీ వర్షం, వరదల సమయంలో బిక్కుబిక్కుమంటూ గడిపామని, మరోసారి ఆ స్థాయి వర్షం వస్తే చెరువుతో పాటు చెరువుకు ఆనుకుని ఉన్న రైల్వేలైన్‌కు సైతం ప్రమాదం పొంచి ఉందని వినతిలో పేర్కొన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఖమ్మం రైల్వే అధికారులను సైతం కలిసి వినతి పత్రం అందించారు. వినతి అందించిన వారిలో మాజీ కార్పొరేటర్ చేతులు నాగేశ్వరరావు, మొర్రి మేకల కోటయ్య, వెంకటనారాయణ, బండ్ల వెంకటేశ్వర్లు, వాగదాని రాజు, జంగల నాగేశ్వరరావు, తెలిబోయిన వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ప్రహరీ నిర్మించాలి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలోని గిరిజన కాలేజీ బాలుర వసతి గృహ ప్రహరీ నిర్మించాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ల సత్యనారాయణ కోరారు. ఈమేరకు సోమవారం అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు రక్షణ కల్పించేందుకు ప్రహరీ నిర్మించాలని కోరారు. వినతి అందించిన వారిలో సత్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటో డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జవాన్లు

ఖమ్మంమయూరిసెంటర్: జవాన్‌పై దాడి చేసిన స్వచ్ఛ ఆటో డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జవాన్లు మేయర్ పునుకొల్లు నీరజకు వినతిపత్రం అందజేశారు. మూడు రోజుల క్రితం 19వ డివిజన్ స్వచ్ఛ ఆటో డ్రైవర్ సతీష్, 18వ డివిజన్ జవాన్ రాంబాబుతో వాగ్వాదం పెట్టుకొని.. కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారని మేయర్‌కు వివరించారు. జవాన్ డ్రైవర్‌పై పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టగా.. యూనియన్ నాయకులు బెదిరిస్తున్నారని, దాడి చేసిన డ్రైవర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండానే విధుల్లో కొనసాగిస్తున్నారని మేయర్‌కు తెలిపారు. దీనిపై స్పందించిన మేయర్ ఇలాంటి ఘటనలు జరగకుండా డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ నాయకుల జోక్యం లేకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ అధికారులకు సూచించారు.

జామాయిల్ నరికివేతకు అనుమతివ్వండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: గిరిజనులు వన సంరక్షణ సమితి ద్వారా సాగు చేసిన జామాయిల్ పంట నరికి విక్రయించేందుకు అనుమతి ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యాన గిరిజనులు అటవీ శాఖాధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. 2000 సంవత్సరంలో పెనుబల్లి మండలం గట్టుగూడెం ఫారెస్టు బీట్‌లో వన సంరక్షణ సమితి ద్వారా 13 హెక్టార్లలో జామాయిల్ పంటను సాగు చేయగా.. ఐదేళ్లకే కటింగ్ చేయాల్సి ఉంది. కాని 24 ఏళ్లు గడిచినా కటింగ్ చేయకపోవడంతో గాలికి చెట్లు విరిగిపోతున్నాయని గిరిజనులు అటవీ అధికారులకు తెలిపారు. వన సంరక్షణ సమితి సభ్యులు కుటుంబాలతో కలిసి జామాయిల్‌ను పెంచేందుకు చేసిన శ్రమ వృథా అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తులను పరిశీలించిన అటవీ శాఖాధికారులు వారం రోజుల్లో అనుమతులు ఇస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు తాటి వెంకటేశ్వరరావు, కొమ్మినేని సుధాకర్, వన సంరక్షణ సమితి చైర్మన్ పి.పుల్లయ్య, సభ్యులు జోగయ్య, సావిత్రి, వెంకటేష్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్లేడు కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఇబ్రాయిల్

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ పి.వి.రామకృష్ణకు మాజీ సర్పంచ్ మండడి ఇబ్రాయిల్ వినతిపత్రం అందజేశారు. గతంలో సుబ్లేడు గ్రామం పరిపాలన కేంద్రంగా కొనసాగిందని, మండల ఏర్పాటు కోసం ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. చుట్టుపక్కల గ్రామాలకు అందుబాటులో ఉన్న సుబ్లేడు మండల సాధనకు కృషి చేయాలని కోరారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి

ఖమ్మంరూరల్: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని పొన్నేకల్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నేడు దేశం విపత్కర పరిస్థితుల్లో ఉందని కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో ప్రజల్లో వైషమ్యాలు సృష్టిస్తున్న బీజేపీ ప్రభుత్వ తీరును తిప్పికొట్టేందుకు యువత పోరాడాలని పేర్కొన్నారు. ఎర్రజెండాకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, నాయకులు పి.సంగయ్య, వి.నాగేశ్వరావు, వరగాని మోహన్‌రావు, వి.సుదర్శన్‌రెడ్డి, ఏర్పుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు అన్యాయం

నేలకొండపల్లి: అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ పాలేరు డివిజన్ నాయకుడు పగిడికత్తుల రామదాసు అన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి పర్యటన సందర్భంగా స్థానిక పోలీసులు వారిని అరెస్ట్ చేయగా.. సోమవారం విలేకర్లతో మాట్లాడారు. పంటలు ఎండిపోకుండా సాగర్ జలాలు విడుదల చేయాలని, ఎకరానికి పరిహారం రూ. 30 వేలు చెల్లించాలన్నారు. ఇఫ్టూ పాలేరు ఏరియా కమిటీ ఉపాధ్యక్షుడు వెంకన్న, భిక్షం పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కామేపల్లి: అనారోగ్య కారణాలతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన మండలంలోని తాళ్లగూడెం గ్రామంలో మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్యతో కలిసి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. నిరుపేదలకు ఆసరాగా నిలిచే సీఎంఆర్ఎఫ్‌ను లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మూతబడిన మైనార్టీ గురుకులం

ఖమ్మంరూరల్: మండలంలోని జలగంనగర్‌లో నిర్వహిస్తున్న నేలకొండపల్లి మైనార్టీ గురుకుల పాఠశాల గత 13 రోజులుగా మూతబడడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మున్నేటికి వచ్చిన వరదలతో పాఠశాల ప్రాంగణం, గదులు మొత్తం నీరు చేరి వరదలతో మునిగిపోయింది. దీంతో ఈనెల 10 వరకు పాఠశాలకు సెలవులు ప్రకటించారు. సెలవులు అయిపోయి ఇప్పటికీ పదమూడు రోజులు కావొస్తున్నా ఇంత వరకు పాఠశాల పునఃప్రారంభానికి నోచుకోపోవడంతో సుమారు 450 మంది విద్యార్థుల భవిష్యత్ ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థుల్లో మరింత ఆందోళన..

వరదల సమయాన పాఠశాలలో ఉన్న సుమారు 40 క్వింటాళ్ల బియ్యంతో పాటు కూరగాయలు, వంట పాత్రలు తడిసిపోగా.. తరగతి గదులు బురదమయంగా మారాయి. అయితే ఇప్పటి వరకు పాఠశాలను శుభ్రం చేయించి తరగతులను బోధించకపోవడంతో విద్యార్థుల్లో మరింది ఆందోళన పెరిగింది. ఈ విషయమై మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు దృష్టి సారించి తక్షణమే పాఠశాలను ప్రారంభించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



జలగంనగర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాల